సాక్షి తిరుపతి

సోమవారం । 14 । జూలై । 2025



ఆగస్టులో జూనియర్స్ సీపీఎల్-1
జూనియర్స్ సీపీఎల్ టోర్నమెంట్‌ను ఆగస్టులో నిర్వహించనున్నట్లు సీడీసీపీ అధ్యక్షుడు విజయ్‌కుమార్ తెలిపారు. - 8లో



ఆగని అక్రమ నిర్మాణాలు
తిరుపతి నగర శివారుల్లో ప్రభుత్వ భూములు కబ్జా చేస్తున్నారు. అక్రమంగా భారీ భవనాలను నిర్మిస్తున్నారు. - 8లో



ప్రశ్నార్థకంగా డిగ్రీ ప్రవేశాలు
డిగ్రీలో ప్రవేశానికి ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేయకపోవడంతో విద్యార్థులు అయోమయానికి గురవుతున్నారు. - 8లో

న్యూస్‌రీల్

శ్రీవారి దర్శనానికి 24 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ అధికంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో కంపార్ట్‌మెంట్లు నిండిపోవడంతో భక్తులు ఆక్టోపస్ సర్కిల్ వరకు బారులు తీరారు. శనివారం అర్ధరాత్రి వరకు 92,221 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 42,280 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.3.51 కోట్ల ఆదాయం వచ్చింది. ఈ మేరకు టైంస్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 24 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు ఉంటే 3 గంటల్లో దర్శనమవుతోంది. ఈ క్రమంలోనే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికే క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేసింది. కేటాయించిన సమయాయం కంటే ముందు వస్తే క్యూలోకి అనుమతించమని స్పష్టం చేసింది.

నేడు కలెక్టరేట్‌లో గ్రీవెన్స్

తిరుపతి అర్బన్: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కలెక్టరేట్‌లో సోమవారం గ్రీవెన్స్ నిర్వహించనున్నారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించనున్నారు. కలెక్టర్, జేసీ, డీఆర్‌ఓతోపాటు వివిధ శాఖల అధికారులు అందుబాటులో ఉండనున్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టరేట్ సిబ్బంది సూచిస్తున్నారు.

రేపటి నుంచి పీ-4 రీసర్వే



దత్తత తీసుకున్న కుటుంబాలతో కలెక్టర్ వెంకటేశ్వర్(ఫైల్)

తిరుపతి అర్బన్ : ప్రభుత్వం చేపట్టిన పీ-4 పాలసీలో రెండో దశ కింద రీసర్వేను మంగళవారం నుంచి ప్రారంభించనున్నారు. అందులో భాగంగా ఈ నెల 20వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహించనున్నారు. రెండు నెలల క్రితం సచివాలయ ఉద్యోగులు ఇంటింటికీ వెళ్లి జీరో ప్రావర్టీ కింద జిల్లావ్యాప్తంగా 80,324 కుటుంబాలను గుర్తించారు. ఆగస్టు 15వ తేదీ నాటికి ఈ కుటుంబాలను దత్తతకు అప్పగించాలని లక్ష్యం నిర్దేశించారు. అయితే కుటుంబాల సంఖ్యలో ఎక్కువగా ఉండడంతో మరోసారి సర్వే చేయాలని నిర్ణయించారు. లబ్ధిదారుల సంఖ్యను తగ్గించేందుకు చర్యలు చేపట్టనున్నారు. అనంతరం ఆయా కుటుంబాలను దత్తత తీసుకోవాలని భావిస్తున్నారు. ఈ క్రమంలో ఇప్పటి వరకు 5 కుటుంబాలను కలెక్టర్ దత్తత తీసుకున్నారు. మిగిలిన కుటుంబాలను జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు, సేవా సంస్థలకు అప్పగించాలని చూస్తున్నట్లు సమాచారం.

29 వరకు 'నవోదయ' దరఖాస్తుకు గడువు

తిరుపతి ఎడ్యుకేషన్: జాతీయ స్థాయిలో 2026-27విద్యాసంవత్సరానికి సంబంధించి నవోదయ పాఠశాలల్లో ప్రవేశ పరీక్ష దరఖాస్తుకు ఈ నెల 29వ తేదీ ఆఖరు గడువని విశ్వం విద్యాసంస్థల అధినేత, కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రవేశ పరీక్షను డిసెంబరు 13న నిర్వహించనున్నట్లు వెల్లడించారు. వివరాలకు 86888 88802, 93999 76999 నంబర్లలో సంప్రదించాలని కోరారు.



ఆర్‌పీ హేమలతను నిలదీస్తున్న డ్వాక్రా మహిళలు (ఫైల్)

వెలుగుచీడలు!

డ్వాక్రా మహిళల నగదుకు భద్రత కరువైంది. అష్టకష్టాలు పడి సంఘాలకు చెల్లిస్తున్న సొమ్ము రిసోర్స్‌పర్సన్ల పాలవుతోంది. మెప్మా సిబ్బంది అవినీతి కారణంగా 'వెలుగు' లక్ష్యం నీరుగారిపోతోంది. అధికారుల అండతో ఆర్‌పీల చేతివాటం పెరిగిపోతోంది. బ్యాంకు ఉద్యోగులు సైతం సహకరిస్తుండడంతో యథేచ్ఛగా స్వాహాల పర్వం కొనసాగుతోంది. అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోకపోవడంతో ఆడపడుచులకు దిక్కుతోచని దుస్థితి దాపురిస్తోంది. నిధులు నొక్కేసిన ఘటనలపై అడపాదడపా విచారణ చేపట్టినప్పటికీ రాజకీయ జోక్యంతో సమస్య అటకెక్కుతోంది.



డ్వాక్రా మహిళలను మోసం చేస్తున్న రిసోర్స్‌పర్సన్లు

- తరచూ బయటకు వస్తున్న అక్రమాలు
- అవినీతిపరులకు అండగా మెప్మా అధికారులు
- తమ వంతు సహకరిస్తున్న బ్యాంకు ఉద్యోగులు
- ఆందోళనలో పొదుపు సంఘాల సభ్యులు

తిరుపతి తుడా : మెప్మాలోని కొందరు రిసోర్స్ పర్సన్లు వివిధ మార్గాల్లో డ్వాక్రా సంఘ సభ్యుల సొమ్మును నొక్కేస్తున్నారు. అందులో కొంత మొత్తాన్ని మెప్మా అధికారులు, బ్యాంకు ఉద్యోగులు, రాజకీయ నేతలకు ముట్టజెపుతున్నారు. దీంతో వారి అవినీతి అక్రమాలకు అడ్డూ అదుపూలేకుండాపోయింది. తిరుపతి పట్టణ పేదరిక నిర్మూలన సంస్థలో టీఎల్ఎఫ్-4 (టౌన్ లెవల్ ఫెడరేషన్), ఎస్ఎల్ఎఫ్-167 (స్లమ్ లెవల్ ఫెడరేషన్) పరిధిలో 4,370కి పైగా డ్వాక్రా సంఘాలు ఉన్నాయి. 44వేల మంది వరకు సభ్యులు ఉన్నారు. మొత్తం 167మంది ఆర్‌పీలు ఈ సంఘాల నిర్వహణ బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు. ప్రతి నెలా ఒక్కో సభ్యురాలు రూ.200లు పొదుపుతో పాటు తీసుకున్న రుణానికి సంబంధించి కంతులను చెల్లిస్తుంటారు. కేవలం పొదుపు ద్వారా ప్రతి నెలా తిరుపతి మెప్మా పరిధిలో దాదాపు రూ.90లక్షలు జమ చేస్తున్నారు. అలానే ఆర్‌పీల ద్వారా రుణ చెల్లింపుల కింద సుమారు నెలకు రూ. 4.50కోట్లు లావాదేవీలు జరుగుతున్నాయి. కొంత మంది ఆర్పీలు నెలవారీ గడువులోపు బ్యాంకుల్లో నగదు జమ చేయకుండా తమ సొంత అవసరాలకు వినియోగించుకుంటున్నారు.

బట్టబయలైన బాగోతం ఇలా..

ఆర్‌పీ హేమలత పరిధిలోని ఓ సంఘం సభ్యులు నెల వారీ రుణాలను పక్కాగా చెల్లించారు. మరో సారి రుణం తీసుకోవాలని నిర్ణయించుకున్నారు. అయితే ఆర్‌పీ స్పందించకపోవడంతో నేరుగా బ్యాంకు మేనేజర్‌ను సంప్రదించారు. తమకు రూ.2లక్షల చొప్పున రుణాలు కావాలని కోరారు. సంబంధింత సంఘం ఖాతాను మేనేజర్ పరిశీలించారు. పాత రుణం చెల్లించకుండా కొత్తవి ఇవ్వడం కుదరదని తెగేసి చెప్పడంతో డ్వాక్రా మహిళలు అవాక్కయ్యారు. పొదుపు, రుణ చెల్లింపులకు సంబంధించి రశీదులను చూపించగా అవి నకిలీవని మేనేజర్ గుర్తించారు. ఈ ఘటనతో ఆర్‌పీ హేమలత అవినీతి బాగోతం బట్టబయలైంది.

రూ.70లక్షలు నొక్కేసిన ఆర్‌పీ

తిరుపతి నగరంలోని లక్ష్మీపురంలో ఎస్ఎల్ఎఫ్ ద్వారా రిసోర్స్ పర్సన్ హేమలత 33 డ్వాక్రా సంఘాల లావాదేవీలను నిర్వహిస్తోంది. సభ్యుల పొదుపుతో పాటు రికవరీ మొత్తాన్ని సకాలంలో చెల్లించకుండా నొక్కేసిన విషయం ఆలస్యంగా వెలుగు చూసింది. ఈ విషయంపై స్థానిక ప్రజా ప్రతినిధులు, సంఘాల సభ్యులు శనివారం ఆందోళన చేపట్టారు. ఆర్‌పీ అవినీతి అక్రమాలను బట్టబయలు చేశారు. ప్రతి నెలా నిర్దేశించి తేదీలో వసూలు చేసిన డబ్బులను సదరు ఆర్‌పీ బ్యాంకులో జమ చేయకుండా మాయ చేస్తూ వచ్చేది. సంఘాల నేతలను బ్యాంకు లోకి వెళ్లనీయకుండా లావాదేవీల వ్యవహారం నడిపించేది. ఈ క్రమంలోనే బ్యాంకులో నకిలీ రసీదులను సృష్టించి నగదును స్వాహా చేస్తూ వచ్చింది. ఆమె పరిధిలోని 33 సంఘాల సభ్యుల పొదుపు సొమ్ముతో పాటు చెల్లించాల్సిన రుణ కంతులను సైతం కాజేసినట్లు వెల్లడైంది. సుమారు రూ.60లక్షల రుణ చెల్లింపులు, రూ.10లక్షల పొదుపు నిధులను దిగమింగేసింది. సంఘాలకు అందించే నకిలీ రశీదుల వ్యవహారంలో బ్యాంకు ఉద్యోగి హస్తమున్నట్లు తెలుస్తోంది.

ఆందోళనలో పొదుపు మహిళలు

తిరుపతిలో ఒక్క ఆర్‌పీనే సుమారు రూ. 70లక్షల నగదు స్వాహా చేసిన ఉదంతం సంచలనంగా మారింది. ఇలాంటి అవినీతి తిమింగలాలు ఇంకా ఎన్ని ఉన్నాయో అంటూ నగరంలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. తాము చెల్లిస్తున్న నగదు భద్రమేనా అంటూ మహిళా సంఘాల సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఓ ఆర్‌పీ అవినీతిని వెలుగులోకి రావడంతో ఆ అవమానం నుంచి బయటపడేందుకు ఆమె ఆత్మహత్యకు యత్నించింది. ఇలా ఒకరిద్దరు ఆర్‌పీలతో మెప్మా ప్రతిష్ఠ మసకబారుతోంది. డ్వాక్రా సంఘాలకు సంబంధించి అధికారులు పక్కాగా ఆడిట్ నిర్వహించాల్సి ఉంది. దీంతో అవినీతి అక్రమాలను కట్టడి చేసేందుకు అవకాశముంటుంది.

తిరుపతికి మరో 'వందే భారత్'



తిరుపతి అన్నమయ్యసర్కిల్ : తిరుపతికి మరో వందేభారత్ రైలు రానుంది. ఈ మేరకు రైల్వేశాఖ నుంచి గ్రీన్‌సిగ్నల్ వచ్చింది. ఈ కొత్త రైలును విజయవాడ-బెంగళూరు వయా తిరుపతి మధ్య నడిపేందుకు రూట్ నిర్ణయించారు. కేవలం తొమ్మిది గంటల్లోనే విజయవాడ నుంచి బెంగళూరుకు, నాలుగున్నర గంటల్లోనే తిరుపతి చేరుకునేలా షెడ్యూల్ ఖరారు చేశారు. ఎప్పటి నుంచి పట్టాలపైకి వస్తుందనేది అధికారికంగా ప్రకటించాల్సి ఉంది.

సమయం ఆదా

విజయవాడ నుంచి చెన్నైకు ప్రస్తుతం వందేభారత్ నడుస్తోంది. బెంగళూరుకు కేటాయించాలనే వినతి మేరకు రైల్వే శాఖ మేలోనే ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. కోచ్‌లు సమస్య కారణంగా ఆలస్యం అయినట్లు తెలుస్తోంది. ఇప్పుడు ఈ రైలు పట్టాలెక్కేందుకు సిద్ధమవుతోంది. ఇందులో బెంగళూరు ప్రయాణం ఇతర రైళ్ల కంటే 3 గంటల సమయం ఆదా కానుంది. మొత్తం 8 బోగీల్లో 7 ఏసీ చైర్ కార్, ఒకటి ఎగ్జిక్యూటివ్ చైర్ కార్ ఉంటాయి. ఈ ట్రైన్ మంగళవారం మినహా వారానికి 6 రోజుల పాటు నడవనుంది.

రూట్ షెడ్యూల్ ఇదీ..

కొత్త వందేభారత్‌కు రైలుకు 20711 నంబర్ కేటాయించారు. అలాగే రూట్ షెడ్యూల్ మేరకు ఈ రైలు విజయవాడలో ఉదయం 5.15 గంటలకు బయలుదేరి తెనాలి 5.39, ఒంగోలు 6.28, నెల్లూరు 7.43, తిరుపతి 9.45 గంటలకు చేరుకుంటుంది. అనంతరం చిత్తూరు 10.27, కాట్పాడి 11.13, కృష్ణరాజపురం, 13.38, ఎస్ఎంవీటీ బెంగళూరుకి 14.15 గంటలకు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో అదే రోజు ఈ ట్రైన్ బెంగళూరులో మధ్యాహ్నం 14.45 గంటలకు బయలుదేరి కృష్ణరాజపురం 14.58, కాట్పాడి 17.23, చిత్తూరు 17.49, తిరుపతి 18.55, నెల్లూరు 20.18, ఒంగోలు 21.29, తెనాలి 22.42, విజయవాడకు 23.45 గంటలకు చేరుకుంటుంది.

ముగిసిన గ్రాప్లింగ్ పోటీలు



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన రెజ్లర్లతో నిర్వాహకులు

తిరుపతి ఎడ్యుకేషన్ : తిరుపతిలోని గిరిజన భవన్‌లో రెండు రోజులుగా నిర్వహిస్తున్న గ్రాప్లింగ్ రాష్ట్ర స్థాయి చాంపియన్‌షిప్ ఆదివారంతో ముగిసింది. సబ్ జూనియర్స్, క్యాడెట్ (బాయ్స్ అండ్ గరల్స్) విభాగాల్లో బాలబాలికలకు పోటీలు నిర్వహించారు. సబ్ జూనియర్స్ విభాగంలో 20మంది బాలురు, 20మంది బాలికలు, అలాగే క్యాడెట్ విభాగంలో 10మంది బాలురు, 10మంది బాలికలు, మొత్తం 60మంది రెజ్లర్లను జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారు. వీరు ఈ నెల 26 నుంచి 29వ తేదీ వరకు చత్తీస్‌ఘడ్ రాష్ట్రం బిలాస్‌పూర్‌లో నిర్వహించే జాతీయ స్థాయి గ్రాప్లింగ్ పోటీల్లో ఏపీకి ప్రాతినిధ్యం వహించనున్నారు. కార్యక్రమంలో ఒక్రీడా భారతి అధ్యక్షుడు ఎంవీ.మాణిక్యాలు, కార్యదర్శి పి.ధనంజయరెడ్డి, జాయింట్ సెక్రటరీ సురేంద్రరెడ్డి, విశ్వం విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్ రెడ్డి, గ్రాప్లింగ్ అసోసియేషన్ అధ్యక్షులు ఏజీ రేఖారాణి పాల్గొన్నారు.

అన్నా లేరా..నాకు దిక్కెవరు రా?

'అన్నా.. మనకు రెక్కలు రాకముందే అమ్మా నాన్నను ఆ దేవుడు తీసుకెళ్లిపోయాడు. అప్పటి నుంచి అష్టకష్టాలు పడి ఇక్కడిదాకా వచ్చాము. అమ్మమ్మ అక్కున చేర్చుకుని పెంచి పెద్ద చేసింది. నా మనవడు ఉన్నాడన్న ధైర్యంతో బతికేస్తోంది. నేను కూడా తల్లిదండ్రులు లేకపోయినా అన్నీ మా అన్న చూసుకుంటాడనే ఆశతో జీవిస్తున్నాను. ఇప్పుడు మా అందర్నీ దూరం చేసి వెళ్లిపోయావు. మేమెలా బతికేదన్నా' అంటూ ఆ సోదరి తన అన్న మృతదేహంపై పడి రోదించిన తీరు చూపరుల గుండెల్ని మెలిపెట్టింది. శ్రీనివాసులు అంత్యక్రియల సందర్భంగా ఈ దృశ్యం ఆదివారం శ్రీకాళహస్తి మండలం, బొక్కసంపాళెంలో తీవ్ర విషాదాన్ని నింపింది.

శ్రీనివాసులు మృతదేహం వద్ద సోదరి కీర్తి రోదన

- కన్నీటిపర్యంతమైన గ్రామస్తులు
- శోకసంద్రంలో బొక్కినంపాళెం



శ్రీనివాసులు మృతదేహం వద్ద విలపిస్తున్న సోదరి కీర్తి

శ్రీకాళహస్తి: మండలంలోని బొక్కసంపాళెం శోకసంద్రంలో మునిగిపోయింది. జనసేన మాజీ నాయకురాలు వినుత, ఆమె భర్త చంద్రశేఖర్‌నాయుడు, మరో ముగ్గురు కలిసి మా అన్నను చంపేశారంటూ మృతుడు శ్రీనివాసులు అలియాస్ రాయుడు మృతదేహం వద్ద అతడి సోదరి కీర్తి బోరున విలపించడం అక్కడి వారికి కన్నీళ్లు తెప్పించింది. 'చిన్నప్పుడే తల్లిదండ్రులను కోల్పోయాం. ఇపుడు నా రక్తసంబంధమైన అన్నను కూడా కోల్పోయాను' అని విలపించడం చూపరుల కళ్లు చెమర్చేలా చేసింది. ఏడేళ్ల వయసులో వెంకటగిరి నుంచి వచ్చేసి అమ్మమ్మ వద్ద పెరిగాము. ఇప్పుడు అన్నని పోగొట్టుకున్నానని మృతుని సోదరి, వారిని పెంచిన అమ్మమ్మ రాజేశ్వరి ఆవేదనను చూసి గ్రామస్తులు చలించిపోయారు.

మా అన్నని మాట్లాడనివ్వలేదు

అనంతరం మృతుడు శ్రీనివాసులు చెల్లెలు కీర్తి మాట్లాడుతూ 'మా అన్న వారి(జనసేన శ్రీకాళహస్తి నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జి) ఇంటికి పరిమితమయ్యాడు. చాలాకాలంగా చూడడానికి కూడా కష్టంగా ఉండేది. ఒకరోజు కాలు విరిగిందని చెబితే చూడడానికి వెళ్లా. ఇప్పుడు ఎవరైతే చంపేశారో ఆ రోజు మా అన్నను వారు మాట్లాడనివ్వకుండా చేశారు' అని వెల్లడించింది. మా అన్నను పంపించేస్తామని చెప్పారే గానీ ఇలా చంపేస్తారని అనుకోలేదని కన్నీటి పర్యంతమైంది. తన అన్న చావుకు కారణమైన వారిని ఎవర్నీ వదలిపెట్టనని, వారికి చట్ట ప్రకారం శిక్ష పడేలా చేస్తామని తెలిపింది. తనకు అండగా ఉండాలని స్థానికులను కోరింది.

'నాకున్న ఒకే ఒక బంధాన్ని దూరం చేశారు. నా అన్నను అతి కిరాతకంగా చంపేశారు. చిన్నప్పుడే అమ్మానాన్న దూరమయ్యారు. అన్నున్నాడనే ధైర్యంతో బతికేస్తున్నా. ఇప్పుడు ఆ ఒక్క ఆశను కూడా తుంచేశారు. నా అన్నను నాకు లేకుండా చేశారు. పవన్‌కళ్యాణ్ మాకు న్యాయం చేయాలి. న్యాయం కోసం ఎందాకైనా వెళ్తాం..' అంటూ మృతుడు శ్రీనివాసులు సోదరి కీర్తి మాట్లాడడం అక్కడి వారిని ఆలోచనలో పడేసింది.

క్లుప్తంగా

జేసీబీ.. 3 ట్రాక్టర్ల సీజ్



రేణిగుంట : మండలంలోని వెంకటాపురం చెరువులో ఎలాంటి అనుమతులు లేకుండా చేపట్టిన రోడ్డు పనులకు వినియోగిస్తున్న ఒక జేసీబీ, మూడు ట్రాక్టర్లను తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి ఆదివారం సీజ్ చేశారు. అనంతరం అర్బన్ పోలీసులకు అప్పగించారు.

విద్యుదాఘాతంతో బాలుడి మృతి



కుమారుడి మృతదేహం వద్ద విలపిస్తున్న తల్లి

రేణిగుంట : మండలంలోని తూకివాకం పంచాయతీలో ఆదివారం ఓ బాలుడు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. వివరాలు.. అస్సాంకు చెందని 50 కుటుంబాలు తిరుపతి కార్పొరేషన్ డంపింగ్ యార్డ్‌లో పనిచేస్తున్నాయి. సమీపంలోనే తాత్కాలిక షెడ్లలో నివసిస్తున్నాయి. వీరిలోని అహితిల్ హిస్లం, హియదూర్ హిస్లం దంపతుల కుమారుడు ముక్తార్ హుస్సేన్(10) ఆదివారం ఉదయం ఇంటి వద్ద ఆడుకుంటూ పక్కనే ఉన్న విద్యుత్ స్తంభం వద్దకు వెళ్లి వేలాడుతున్న తీగను పట్టుకున్నాడు. కరెంట్ షాక్ కొట్టడంతో అక్కడికక్కడే మరణించాడు. దీనిపై సమాచారం అందుకున్న గాజులమండ్యం ఎస్ఐ సుధాకర్ ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తిరుపతిలోని ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యారంగం.. విధ్వంసం!



గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యావిప్లవానికి శ్రీకారం చుట్టింది. పేద విద్యార్థుల ఉన్నత చదువులకు బంగారు బాటలు వేసింది. అయితే కూటమి సర్కారు వచ్చిన తర్వాత విద్యారంగాన్ని విధ్వంసం చేస్తోంది. కార్పొరేట్‌కు కొమ్ముకాస్తూ గ్రామీణ విద్యార్థుల భవితను ప్రశ్నార్థకంగా మార్చేస్తోంది. అందులో భాగంగా విశ్వవిద్యాలయాల్లో పలు కోర్సులకు మంగళం పాడేసింది. అడ్మిషన్లు లేవనే సాకుతో మరిన్నింటిని తొలగించేందుకు కుయుక్తులు పన్నుతోంది. ఈ క్రమంలోనే వ్యవసాయ పాలిటెక్నిక్‌ను పూర్తిగా రద్దు చేసేసింది. అలాగే యానిమల్ హస్బెండరీ కోర్సును సైతం చెల్లుచీటీ రాసేందుకు సన్నద్ధమవుతోంది. ఇక సాంకేతిక విద్యకు అధ్యాపకులను నియమించకుండా నిర్వీర్యం చేస్తోంది.

కోర్సుల కోత.. కాలేజీల మూత!

- యూనివర్సిటీలలో పలు కోర్సులకు మంగళం
- మరిన్నింటిని రద్దు చేసే యత్నంలో ప్రభుత్వం
- అగ్రి పాలిటెక్నిక్ కళాశాలలకు చెల్లిన కాలం
- సర్కారు వైఖరిపై విద్యార్థి సంఘాల ఆగ్రహం

తిరుపతి సిటీ : గ్రామీణ ప్రాంత విద్యార్థుల ఉన్నత విద్యాభ్యాసానికి విశ్వవిద్యాలయాలే దిక్కు. అయితే వర్సిటీల్లో పేద విద్యార్థులు అడ్మిషన్లు పొందే ఆర్ట్స్ గ్రూప్‌లను క్రమేణా కుదిస్తూ వస్తోంది. అడ్మిషన్లు తక్కువగా ఉన్నాయంటూ మెర్జింగ్ పేరుతో పలు కోర్సులను ఇప్పటికే రద్దు చేసింది. ఈ ఏడాదిలో వర్సిటీలలో సుమారు 12 కోర్సులను తొలగించింది. టెక్నాలజీ పేరుతో ఏఐ, డేటా సైన్స్ అంటూ నూతన కోర్సులను ప్రవేశపెట్టినప్పటికీ బోధనకు నిపుణులైన అధ్యాపకులు లేకపోవడంతో సాంకేతిక విద్య సైతం గాడి తప్పుతోంది.

మూతపడిన వ్యవసాయ పాలిటెక్నిక్

గ్రామీణ వ్యవసాయ కుటుంబం నుంచి పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు ఎంతో ఆసక్తితో చేరే వ్యవసాయ పాలిటెక్నిక్ కోర్సును పూర్తిగా తొలగించారు. తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వ్యవసాయ పాలిటెక్నిక్‌లో 2025–26 విద్యా సంవత్సరానికి ప్రవేశాలను నిలిపివేస్తూ ఎన్‌జీ రంగా వర్సిటీ ఇటీవలే ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో ఆ కోర్సులో చేరాలనుకునే విద్యార్థులకు నిరాశే మిగిలింది. అదే దారిలో వెటర్నరీ వర్సిటీ ఆధ్వర్యంలో నడుస్తున్న యానిమల్ హస్బెండరీ పాలిటెక్నిక్ కోర్సుకు సైతం త్వరలో గండం పొంచి ఉన్నట్లు తెలుస్తోంది. ప్రవేశాలు తక్కువగా ఉన్నాయనే నెపంతో పలు కోర్సులకు మంగళం పాడుతున్న ప్రభుత్వ వైఖరిపై అధ్యాపకులు, విద్యార్థి సంఘాల నేతలు మండిపడుతున్నారు.

నిర్వీరం చేసే కుట్ర



వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసేందుకే వ్యవసాయ పాలిటెక్నిక్ కోర్సుకు ప్రభుత్వం మంగళం పాడేసింది. ఇదే తరహాలో మరిన్ని కోర్సులను రద్దు చేసి కార్పొరేట్ విద్యకు పెద్దపీట వేసేందుకు కుట్ర పన్నుతోంది. వర్సిటీలలో పెద్ద సంఖ్యలో మెర్జింగ్ పేరుతో పలు కోర్సులను రద్దు చేయడం దారుణం. – ఎస్.అక్బర్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు, తిరుపతి

కోర్సుల రద్దు సరికాదు



ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను పూర్తిస్థాయిలో ఇంత వరకు విడుదల చేయలేదు. విద్యార్థుల ప్రవేశాలు తగ్గుముఖం పట్టడంతో వర్సిటీలు దయనీయస్థితిలో ఉన్నాయి. ఇలాంటి సందర్భంలో అడ్మిషన్లు పెంచేందుకు చర్యలు చేపట్టకుండా కోర్సులను రద్దు చేయడం సరికాదు. – ప్రవీణ్ కుమార్, జిల్లా కార్యదర్శి, ఏఐఎస్ఎఫ్, తిరుపతి

ఉన్నత విద్య దూరమవుతోంది



ప్రభుత్వం కారణంగా గ్రామీణ పేద విద్యార్థులకు ఉన్నత విద్య దూరమవుతోంది. అందుకే వర్సిటీలలో పలు కోర్సులను రద్దు చేసింది. వ్యవసాయ పాలిటెక్నిక్‌తో ఎంతో మంది గ్రామీణ విద్యార్థులు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. అలాంటి కోర్సులను రద్దు చేసి ఏకంగా కళాశాలలనే మూసివేయడం దారుణం. – ఆర్.ఆషా, పీడీఎస్‌ఓ జిల్లా కార్యదర్శి, తిరుపతి

ఆశగా ఎదురు చూశాం



ఈ ఏడాది అగ్రి పాలిటెక్నిక్ కోర్సులో చేరాలని ఎంతో ఆశగా ఎదురు చూశా. మా సమీప బంధువు ఓ అమ్మాయి వ్యవసాయ పాలిటెక్నిక్ కోర్సు పూర్తి చేసి విలేజ్ అగ్రికల్చరల్ ఆఫీసర్‌గా పనిచేస్తోంది. నేను కూడా ఉద్యోగం సాధించి రైతులకు సేవ చేయాలనుకున్నా. కానీ ఈ ఏడాది తిరుపతిలో ఆ కోర్సును రద్దు చేశారని తెలిసింది. ఏం చేయాలో అర్థం కాని పరిస్థితి. – సౌమ్య, విద్యార్థిని, తిరుపతి

బాధగా ఉంది



తిరుపతిలో వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలలో మా అబ్బాయిని చదివించాలని అనుకున్నాం. కానీ ఈ ఏడాది నుంచి కోర్సును పూర్తిగా ఎత్తివేశారని తెలిసి చాలా బాధగా ఉంది. వ్యవసాయ విద్యను ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు పాలిటెక్నిక్ కోర్సును దూరం చేయడం తగదు. దీంతో వ్యవసాయ రంగంపై ప్రభుత్వానికి ఎంత చిత్తశుద్ధి ఉందో అర్థమవుతోంది. – రామయ్య, రైతు, తిరుపతి రూరల్

భ్రష్టుపట్టించారు



వర్సిటీలలో గ్రామీణ ప్రాంత పిల్లలు ఎంతో ఆసక్తితో చేరే ఆర్ట్స్ గ్రూప్‌లను ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. వ్యవసాయ విద్యను దూరం చేసే నిర్ణయాలు మంచివి కావు. వ్యవసాయ పాలిటెక్నిక్‌లో అడ్మిషన్లు రద్దు చేసి మూసివేయడం దారుణం. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత విద్యావ్యవస్థను భ్రష్టుపట్టించారు. – మురళీధర్, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, తిరుపతి

22న మామిడి రైతు మహా జనసభ

చిత్తూరు రూరల్ (కాణిపాకం): ప్రపంచ మామిడి దినోత్సవం సందర్భంగా ఈనెల 22న రైతు మహా జనసభ నిర్వహించనున్నట్లు మామిడి రైతు సంక్షేమ సంఘం నేత ఉమాపతి నాయుడు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ చిత్తూరులోని జెడ్పీ సమావేశ మందిరంలో ఈ సభను ఏర్పాటు చేశామని, ఉదయం 10.30 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. మధ్యాహ్నం 1.30 గంటలకు సంఘ సమావేశం ప్రారంభమవుతుందని, మామిడి రైతులు పాల్గొనాలని కోరారు.

ఆగస్టులో జూనియర్స్ సీపీఎల్–1



ఉమ్మడి చిత్తూరు జిల్లా క్రికెట్ జట్టుతో సీడీసీఏ ప్రతినిధులు

తిరుపతి ఎడ్యుకేషన్ : చిత్తూరు ప్రీమియర్ లీగ్(సీపీఎల్) తరహాలో జూనియర్ సీపీఎల్–1 టోర్నీని ఆగస్టులో నిర్వహించనున్నట్లు చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్(సీడీసీఏ) అధ్యక్షుడు విజయ్‌కుమార్ తెలిపారు. ఆదివారం తిరుపతిలోని ఓ హోటల్‌లో జూనియర్స్ సీపీఎల్–1 నిర్వహణపై ఫ్రాంచైజీ ఓనర్లు, క్రీడాకారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి క్రికెట్ క్రీడాకారులు ఏపీఎల్, ఐపీఎల్‌లో చోటు దక్కించుకోవాలనే సంకల్పంతోనే సీపీఎల్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తొలిసారిగా ఏపీఎల్ వేలంలో జిల్లా నుంచి 63మంది క్రికెటర్లు ఉండడం సీడీసీఏకు గర్వకారణమమన్నారు. ఏపీఎల్‌లో జిల్లా క్రీడాకారులు ఉత్తమ ప్రతిభ కనబరచి తప్పకుండా 2026 ఐపీఎల్‌లో స్థానం దక్కించుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. 12నుంచి 16ఏళ్లలోపు యువ క్రికెటర్లతో జూనియర్స్ సీపీఎల్–1 నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి జట్టులో ఇద్దరు మహిళా క్రికెటర్లకు అవకాశం కల్పిస్తామని, 20–20 మ్యాచ్‌లను ప్రత్యక్ష ప్రసారం చేయనున్నట్లు వెల్లడించారు. అనంతరం ఇటీవల కడపలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి అండర్–23 క్రికెట్ వన్డే పోటీల్లో చాంపియన్‌గా నిలిచిన ఉమ్మడి చిత్తూరు జిల్లా జట్టును అభినందించారు. కార్యక్రమంలో సీడీసీఏ కార్యదర్శి రవి, కోశాధికారి గిరిప్రకాష్, ఉపాధ్యక్షులు శ్రీనివాసమూర్తి, శ్రీధర్, జాయింట్ సెక్రటరీ సతీష్‌యాదవ్, రంజీ ప్లేయర్ రాకేష్ పాల్గొన్నారు.

ప్రశ్నార్థకంగా డిగ్రీ ప్రవేశాలు

- విడుదల కాని నోటిఫికేషన్
- అయోమయంలో విద్యార్థులు

తిరుపతి సిటీ: డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల కాకపోవడంతో ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు అయోమయంలో పడ్డారు. చేసేదిలేక ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలను ఆశ్రయిస్తున్నారు. ఈ ఏడాది మార్చిలో ఇంటర్ ఫలితాలు విడుదలయ్యాయి. అయితే ఇప్పటి వరకు డిగ్రీ అడ్మిషన్లకు నోటిఫికేషన్‌ను ప్రభుత్వం విడుదల చేయలేదు. దీంతో విద్యార్థులు బెంగళూరు, హైదరాబాద్‌లో పేరొందిన డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలకు క్యూ కడుతున్నారు. ఇప్పటికే దాదాపు 30వేల మందికి పైగా పలు కాలేజీల్లో చేరినట్లు సమాచారం. సింగిల్ మేజర్, డబుల్ మేజర్ అంటూ సర్కారు మాత్రం తాపీగా డ్రామాలాడుతోంది. ఈ క్రమంలో ఈ ఏడాది ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో 50 శాతం అడ్మిషన్లు కూడా జరిగే అవకాశముండదని విద్యావేత్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రజావిశ్వాసం కోల్పోయిన ప్రభుత్వం

- ఏడాదిలోనే కూటమి ప్రభుత్వం విఫలం
- వచ్చే ఎన్నికల్లో గెలిచి వైఎస్ జగన్ సీఎం కావడం ఖాయం
- మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టో పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మాజీ ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, అనీషారెడ్డి

పుంగనూరు : అత్యధిక మెజార్టీతో ప్రజలు గెలిపించారని గొప్పలు చెప్పుకుంటున్న చంద్రబాబు ఏడాది పాలనలోనే ప్రజా విశ్వాసం కోల్పోయారని మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి విమర్శించారు. ఆదివారం మున్సిపాలిటీ, రూరల్ మండలాల్లో బాబు షూరిటీ– మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని వేల మందితో విడివిడిగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెద్దిరెడ్డి మాట్లాడుతూ.. చంద్రబాబు రాజకీయల్లోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి దాక ఆయన ప్రజలను మోసగించడంలో కొత్తేమీ కాదన్నారు. చంద్రబాబు రాజకీయ జీవితం అంతా మోసాలతోనే సాగిపోతోందన్నారు. ఉచిత బస్సు ప్రయాణం జిల్లాకే పరిమితం చేస్తే ఒకొక్కరూ తిరుపతి వెళ్లాలంటే మూడు జిల్లాల బస్సులు మారాల్సి ఉందన్నారు. ఇలాంటి ప్రయాణాలతో ఉపయోగం లేదన్నారు. చిత్తశుద్ధి ఉంటే ప్రభుత్వానికి శ్రీకాకుళం నుంచి కుప్పం దాక ఉచిత ప్రయాణాలు చేసుకునేలా ఆదేశాలు ఇవ్వాలన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజావిశ్వాసం కోల్పోయిందని, సూపర్–6 ఒక్కటీ అమలు చేయలేదన్నారు. రాష్ట్రంలో రైతులకు గిట్టుబాటు ధరలు లేక టమాటా, మామిడి, మిర్చి, పొగాకు రైతులు వీధిన పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. నష్టపోయిన రైతులను పరామర్శించేందుకు వెళ్తున్న జగన్ మోహన్‌రెడ్డి పర్యటనలకు ప్రజలను రానివ్వకుండా వేల మంది పోలీసులతో చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి, ప్రజలను నియంత్రిస్తున్నారని మండిపడ్డారు. కానీ జగన్ మోహన్‌రెడ్డిపై ఉన్న నమ్మకం, అభిమానంతో ప్రజలకు ఎన్ని అడ్డంకులు సృష్టించిన వేల మంది తరలివచ్చి పర్యటనలను జయప్రదం చేస్తున్నారన్నారు. కూటమి ప్రభుత్వంలో ప్రజలు పడుతున్న కష్టాలను గుర్తించి ఎప్పటికప్పుడు వారికి అండగా నిలుస్తామని స్పష్టం చేశారు.

జగన్ ప్రజాభిమానం చూసి వణుకు

జగన్ సభలకు వస్తున్న ప్రజాభిమానం చూస్తుంటే కూటమి ప్రభుత్వానికి వణుకు పుడుతోందని పెద్దిరెడ్డి ఎద్దేవా చేశారు. ఎప్పుడు ఎన్నికలు జరిగిన వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అత్యధిక మెజార్టీతో సీఎం కావడం ఖాయమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు అనీషారెడ్డి, పెద్దిరెడ్డి, బైరెడ్డిపల్లి కృష్ణమూర్తి, కొండవీటి నాగభూషణం, నియోజకవర్గ నాయకుడు నూతనకాల్వ శ్రీనాథరెడ్డి, సీమ జిల్లాల మైనార్టీ సెల్ ఇన్‌చార్జ్ ఫకృద్దీన్ షరీఫ్, రాష్ట్ర యువత కార్యదర్శి కొత్తపల్లి చెంగారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి రాజశేఖర్‌రెడ్డి, జిల్లా మాజీ వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ముతో పాటు పార్టీ పట్టణ, రూరల్ అధ్యక్షులు ఇర్ఫాన్, అమరనాథరెడ్డి లతో పాటు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మాజీ ఎంపీపీలు, వైఎస్సార్‌సీపీ అభిమానులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికి వెళ్లి తెలియజేయాలి...

ఏడాది పాలనలో కూటమి ప్రభుత్వం సూపర్–6ను అమలు చేయకపోవడం, మేనిఫెస్టోను పట్టించుకోకపోవడంపై వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో బాబు షూరిటీ– మోసం గ్యారెంటీ కార్యక్రమాన్ని ఇంటింటికీ వెళ్లి ప్రతి రోజు తెలియజేయాలని పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపునిచ్చారు. మున్సిపల్ చైర్మన్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లతో పాటు పార్టీ క్యాడర్ పూర్తిగా ఇంటింటికి వెళ్లి ప్రజలను చైతన్యం చేయాలన్నారు. క్యూఆర్ కోడ్ ద్వారా వచ్చే సమాచారాన్ని ప్రజలకు వివరించాలన్నారు.



పుంగనూరు రూరల్ మండలంలో నిర్వహించిన సభకు హాజరైన జనం

ఆగని అక్రమ నిర్మాణాలు

తిరుపతి శివారులో అక్రమ నిర్మాణాలకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. ప్రభుత్వ, మతం స్థలాలు, కాలువలు, శ్మశానాలు, అసైన్డ్ భూముల్లో కబ్జాదారులు పాగా వేసేస్తున్నారు. యథేచ్ఛగా అక్రమ కట్టడాలు నిర్మించేస్తున్నారు. చివరకు కలెక్టరేట్‌కు కూతవేటు దూరంలో అక్రమార్కులు భారీ భవనాలను కట్టేస్తున్నారు. అధికార పార్టీకి చెందిన వారు కావడంతో రెవెన్యూ అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారు. అక్కడక్కడ ఆక్రమిత భూముల్లోని కట్టడాలను జేసీబీలతో కూల్చివేసినట్టుగా ఫొటోలు తీసుకుని వచ్చేస్తున్నారు. అదే చోటులో మళ్లీ భవనాలు వెలుస్తున్నప్పటికీ తమకేం సంబంధం లేదన్నట్టు చేతులు దులిపేసుకుంటున్నారు.

- తూతూ మంత్రంగా కట్టడాల కూల్చివేతలు
- అదే చోట మళ్లీ వెలుస్తున్న భవనాలు
- తిరుపతి శివారులో రెచ్చిపోతున్న అక్రమార్కులు
- కబ్జాకోరల్లో రూ.కోట్ల విలువైన ప్రభుత్వ భూములు
- పట్టించుకోని రెవెన్యూ అధికారులు

సాక్షి, టాస్క్‌ఫోర్స్:తిరుపతి రూరల్ మండలం అవిలాల గ్రామ రెవెన్యూ లెక్కదాఖలా సర్వే నంబరు 484లోని ప్రభుత్వ భూమిలో ఓటీరుకు చెందిన ఓ అధికార పార్టీ నాయకుడు దర్జాగా పక్కా భవనాన్ని నిర్మిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. జాతీయ రహదారికి ఆనుకుని అతి పెద్ద భవన నిర్మాణానికి పునాదులు వేస్తున్నా అడ్డుచెప్పకపోవడంపై స్థానికుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. సుమారుగా రూ.4కోట్ల విలువైన భూమిని కబ్జా చేసి కట్టడాలు చేపట్టిన ఆక్రమణ దారునిపై పలుమార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేకుండా పోయిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం అదే మార్గంలో కలెక్టర్, జేసీ రాకపోకలు సాగిస్తున్నప్పటికీ అక్రమ నిర్మాణాలు సాగుతుండడం గమనార్హం.

నోటీసులతో సరి

తిరుపతి రూరల్ మండలం పరిధిలోని ప్రభుత్వ భూముల్లో అక్రమంగా నిర్మాణాలు చేపట్టిన వారికి రెవెన్యూ అధికారులు నోటీసులు జారీ చేసి చేతులు దులుపుకుంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్థానికుల నుంచి వరుస ఫిర్యాదులు వచ్చినపుడు తూతూ మంత్రంగా అక్రమ కట్టడాలను నేలమట్టం చేసి వస్తున్నారన్న విమర్శలు సైతం వెల్లువెత్తుతున్నాయి.

చతికిలబడిన చట్టం

అనుమతులు లేకుండా చేపట్టే భారీ భవన నిర్మాణాలకు అడ్డుకట్ట వేయడంతోపాటు విలువైన ప్రభుత్వ భూములను కాపాడేందుకు గతంలో వైఎస్సార్‌సీపీ సర్కారు ఎంతో కఠినంగా వ్యవహరించింది. అందులో భాగంగానే గవర్నమెంట్ ల్యాండ్స్ ప్రొటెక్షన్ యాక్టును పక్కాగా అమలు చేయాలని ఆదేశాలు జారీ చేసింది. సెటిల్ మెంట్ భూమిలో భవంతులు నిర్మించాలన్నా, లే అవుట్ పర్మిషన్, భవన నిర్మాణాలకు సరిపడా పంచాయతీ, తుడా అనుమతులతో పాటు ఇతరత్రా నిరభ్యంతర సర్టిఫికెట్లు తీసుకోవాలనే నిబంధనలు తెచ్చింది. అలాగే ప్రభుత్వ ఆక్రమిత భూముల్లో అక్రమ కట్టడాలను అరికట్టేందుకు కలెక్టర్ పర్యవేక్షణలో టాస్క్‌ఫోర్స్ బృందాలను సైతం నియమించింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఈ రెవెన్యూ చట్టం పూర్తిగా చతికిల పడింది. సర్కారు భూములు కబ్జా కోరల్లో చిక్కుకుంటున్నా.. టాస్క్‌ఫోర్స్ పట్టించుకోని దుస్థితి దాపురించింది.

‘అయ్యో’ర్లకు జీతాల సమస్య

- పట్టించుకోని విద్యాశాఖ అధికారులు

చిత్తూరు కలెక్టరేట్ : ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా టీచర్ల బదిలీలు, ఉద్యోగోన్నతుల పూర్తయిన వెంటనే బదిలీ, ఉద్యోగోన్నతి పొందిన టీచర్లకు కొత్త స్థానాల్లో జీతాలకు బిల్లులు పెట్టాల్సి ఉంటుంది. కాగా ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పలు మండలాల్లో ఎంఈఓలు అలసత్వం, పలు కారణాలతో జీతాల బిల్లులు పెట్టలేని దుస్థితి నెలకొంది. నిబంధనల మేరకు బదిలీ, ఉద్యోగోన్నతి పొందిన కొత్త స్థానంలో జాయిన్ అవుతూనే జీతాల బిల్లులను ట్రెజరీకి పంపించేలా విద్యాశాఖ అధికారులు చర్యలు చేపట్టాలి. అయితే జిల్లా విద్యాశాఖ అధికారుల ఆ దిశగా పర్యవేక్షణ చేయకపోవడంతో ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పలు మండలాల్లో టీచర్ల జీతాల బిల్లులను నమోదు చేసుకోలేని పరిస్థితి దాపురించింది. గతంలో విధులు నిర్వహించిన రోజులకు పాత పాఠశాలలో, బదిలీ పొంది జాయిన్ అయిన తేదీ నుంచి కొత్త పాఠశాలలో జీతాలు పొందాల్సి ఉంటుంది. ఇందుకు అవసరమైన ఎల్‌పీసీ లను టీచర్లు ఎంఈవోలకు అందజేస్తే వాటి ఆధారంగా అరియర్ బిల్లులను ప్రతి నెలా 6వ తేదీ నుంచి 10వ తేదీ వరకు ట్రెజరీ అధికారులకు పంపేలా చర్యలు చేపట్టాలి. కొన్ని మండలాల్లో జీతాల మంజూరునకు డ్రాయింగ్ అథారిటీ ఉన్న ఎంఈవో–1 సెలవులో ఉండటం, కొందరు ఉద్యోగ విరమణ పొందడం, మరికొందరు ఇంచార్జీలుగా ఉండటం ఇలాంటి కారణాలతో నిర్ణీత సమయంలో జీతాల బిల్లులు పెట్టలేని దుస్థితి నెలకుంది. ఈ విషయంలో విద్యాశాఖ అధికారులు పకడ్బందీగా చర్యలు చేపట్టి ఎంఈవోలకు స్పష్టమైన ఆదేశాలివ్వాలని బాధిత టీచర్లు డిమాండ్ చేస్తున్నారు.

పొజిషన్ ఐడీలు లేక సమస్య

ఉమ్మడి చిత్తూరు జిల్లా వ్యాప్తంగా అనేక ఆదర్శ ప్రాథమిక (మోడల్ ప్రైమరీ) పాఠశాలలకు వందల సంఖ్యలో టీచర్లు ఉద్యోగోన్నతి పొంది హెచ్‌ఎంలుగా నియమితులయ్యారు. ఇంత వరకు బాగానే ఉండగా వారికి ఇప్పటి వరకు పొజిషన్ ఐడీలు ఇవ్వని పరిస్థితులున్నాయి. ఆ ఐడీలు లేకపోవడంతో జీతాల బిల్లులు పెట్టలేని దుస్థితి నెలకొంది. బిల్లులు సమర్పించే గడువు ఈనెల 10వ తేదీతో ముగియడంతో ఐడీల కోసం ఎదురు చూసిన ఆ హెచ్‌ఎంల ఆశలు ఆవిరయ్యాయి. అదే విధంగా చిత్తూరు జిల్లాలోని నింద్ర ఎంఈవో–1 వ్యక్తిగత కారణాలతో గత నెల 25వ తేదీ నుంచి సెలవులోకి వెళ్లారు. ఆ స్థానంలో మరో అధికారిని నియమించకపోవడంతో జీతాల సమస్య ఏర్పడింది. తిరుపతి జిల్లా బీఎన్ కండ్రిగలో ఎంఈవో ఉన్నా పలు సమస్యలతో బదిలీ టీచర్లకు జీతాల బిల్లులు సిద్ధం చేయలేని పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి జీతాల బిల్లుల నమోదుకు గడువు పొడిగించి న్యాయం చేయాలని బాధిత హెచ్‌ఎంలు, టీచర్లు డిమాండ్ చేస్తున్నారు.